కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసుల

కల్తీకి కళ్లెం ఏదీ..?

నామమాత్రపు తనిఖీలు
కానరాని ధరల సూచిక బోర్డులు
ఎరువుల విక్రయాల్లో మోసం

కల్తీ ఎరువులతో రైతులు దగా పడుతున్నారు. వాటి వలన దిగుబడులు కోల్పోతున్నారు. విక్రయించే వారు మాత్రం లాభాలను ఆర్జిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై ఉండే దానికి, విక్రయించే ధరకూ పొంతన ఉండటం లేదు. ఇక బయోకెమికల్స్, ఫర్టిలైజర్స్ ధరలు రైతులకు తెలీవు. దీన్ని అవకాశంగా చేసుకొని వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. అందినకాడికి దండుకున్నారు. రైతు పెట్టే పెట్టుబడులలో ఎరువులు, పురుగుమందులకు సింహభాగం ఖర్చు చేస్తుండగా అవే నకిలీ, కల్తీ కావడంతో వారు నష్టపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన వ్యవసాయ అధికారులు రైతులు ఫిర్యాదు చేస్తే ఆధారాలు కావాలని కోరడం విడ్డూరం. వారు జరిపే తనిఖీలు 'మమ' అనే రీతిలోనే సాగుతుండటం గమనార్హం.

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు నాలుగు రూపాయలు మిగిలాలంటే అదునులో వర్షాలు కురవాలి. పదునులో విత్తు పడాలి. ఆ తరువాత చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ జరగాలి. తుది దిగుబడులు బాగుండి గిట్టుబాటు ధరలు దక్కితేనే పెట్టుబడులు పోను లాభాలు ఆర్జించేది. వీటిలో వర్షాలు పకృతి పరంగా వచ్చేవి. ఆ తరువాత సస్యరక్షణ. చీడ, పీడలు ఆశించకుండా పురుగుల మందులు, పైరుకు బలానికి ఎరువులు వాడాలి. అయితే ఎరువులు, పురుగు మందుల విషయంలో మాయాజాలం నడుస్తోంది. హిందూపురం వ్యవసాయ శాఖ డివిజన్ తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పలు ఎరువుల దుకాణాల్లో కల్తీ ఎరువులు, పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనం గత వారం రోజుల క్రితం పట్టణంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలే నిదర్శనం. పట్టణంలో గత మంగళవారం ఎడిఎ శివకుమార్, విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ శివన్న, హిందూపురం ఎడిఎ అల్తాఫ్ ఆలీ ఖాన్ బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. బాలాజీ ట్రేడర్స్, శ్రీ బందావన ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, బాలాజీ ట్రేడర్స్ లో 16.535 మెట్రిక్ టన్నుల 10:26:26, 14:35:14, 15:15:15, అమ్మోనియం సల్ఫేట్, యూరియా ఎరువుల విలువ రూ. 4,86,219 ఎరువులను జప్తు చేశారు. ఈ పాస్ మెషిన్ కు ఎరువుల నిల్వలకు తేడా ఉన్నందున చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొన్న ప్రతి రైతుకు తప్పక బిల్లులు ఇవ్వాలని, స్టాక్ బోర్డు పైన స్టాక్ వివరాలు నమోదు చేయాలని అధికారులు హెచ్చరించారు. అయినప్పటి ఎరువుల దుకాణదారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

నామమాత్రపు తనఖీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 950 వరకు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా మొత్తం 23 ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఒక్క హిందూపురం పట్టణంలో 10 దుకాణాల వరకు ఉన్నాయి. అయితే పలుచోట్ల వ్యాపారులు ఎరువుల్లో కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేరున్న కంపెనీల నుంచి వచ్చే ఎరువులు, పురుగు మందులు కాకుండా నాశిరకం విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కొనుగోలు సమయంలో కనీసం బిల్లులు కూడా రైతులకు ఇవ్వని పరిస్థితి. ముఖ్యంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ)లో ఎక్కువ కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే యూరియా బస్తాలో నత్రజని 23శాతం ఉండాలి. కానీ కల్తీ కారణంగా అది తగ్గిపోతోందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు సంబంధించి డబ్బాపై ఉండే ధరకు దుకాణదారుడు విక్రయించే దానికి పొంతన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఒకే కంపెనీ పురుగు మందు డబ్బా ధర ఒక్కో దుకాణంలో ఒక్కో విధంగా విధంగా ఉంది. అలానే కొందరు వ్యాపారులు రైతులకు సరుకు కొన్న వెంటనే బిల్లులు ఇవ్వరు. తరువాత వారికి అనుకూలంగా బిల్లులు రాసుకుంటున్నారు. పట్టణంలో ఓ ఎరువుల దుకాణంపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు బృందంగా ఏర్పడి పెద్ద ఎత్తున ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. అయితే ఏ ఒక్కరిపై కూడా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు. కేవలం పట్టణంలో రెండు షాపులపై స్టాకు తేడా ఉందని సరుకును జప్తు చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతు ప్రయోజనాలను కాపాడటంలో వ్యవసాయ శాఖ ముందుంటుంది. రైతులు ఎరువులు లేదా పురుగుమందులు కొన్న వెంటనే బిల్లులను తీసుకోవాలి. కల్తీ అనీ, ఎక్కువ ధర తీసుకుంటున్నారని అనుమానం వచ్చినపుడు వెంటనే స్థానిక వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ఏడీఏ అల్తాఫ్ ఆలీ ఖాన్,
హిందూపురం డివిజన్

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్‌ఫొటో)

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి- హిందూపురం

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఐదు రోజుల నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ముందు కార్మికులు చేస్తున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, పట్టణ కన్వీనర్ రాము మద్దతు పలికారు. ఈ సందర్భంగా జెడ్‌పి శ్రీనివాసులు మాట్లాడుతు 22 రోజుల పాటు శాంతి యుతంగా, 5 రోజుల నుంచి విధులు బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు సమ్మె చేస్తున్నా పాలకులు, అధికారులు ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో మున్సిపల్ కార్మికుల 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ పరిపాలన అధికారులు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 సంవత్సరాలకు రిటెర్మెంట్ వయస్సు పెంచాలనాన్రు. ప్రమాదవశాత్తూ, అనారోగ్యంతో మరణిస్తున్న పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం పెంచి ఇస్తామన్నారని, నేటికీ ఆ జీవో ఇవ్వ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ పరిధిలో పెరిగిన ప్రజలకు తగ్గట్టుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పనిముట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించలేని పక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షకార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, కోశాదికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవిత మ్మ గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని సిఐటియు నాయకుడు పైపల్లి గంగాధర్ విమర్శించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమం 8వ రోజైన ఆదివారం కొనసాగింది. గంగాధర్ మాట్లాడుతూ కార్మికులు సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాప్రతినిధులు కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. తాము గొంతెమ్మ కోరికలు కోరలేదని ప్రభుత్వం జీవో చేసిన 36ను అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేయాలని, కార్మికులకు జీవిత బీమా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం నాయకులు రామదాసు, రమణ, రమేష్, గణేష్, సాయినాథ్‌రెడ్డి, గంగాధర్, సద్దాంహుస్సేన్, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు గోవిందు, నరసింహులు, నాగరాజు, పోతలయ్య, రామయ్య, పెద్దన్న, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో సమ్మెలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ఆక్రమణలో సొసైటీ స్థలాలు

నూతన భవన నిర్మాణం సాకారం అయ్యేనా..?
దశాబ్దకాలంగా ఆరుబయటే అధ్యక్షుడి కార్యాలయం

శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనం

సొసైటీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షెడ్

ప్రజాశక్తి- పరిగి

వ్యవసాయరంగ పరంగా రైతులకు ప్రభుత్వ పథకాలు మరింత దగ్గర చేసేందుకు ఏర్పాటుచేసిన వాటిలో వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఒకటి. ఈ సంఘాల ద్వారా సహకార సంఘాల వ్యవస్థలను బలోపేతం చేసి వాటికి అనుగుణంగా రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు రుణాలతో పాటు చిన్న తరహా వ్యవసాయ పరికరాలను రైతులకు అందించేవారు. ఈ వ్యవస్థ నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో ఏర్పాటైంది. పరిగి మండల వ్యాప్తంగా మూడు వ్యవసాయ పరపతి సంఘాలను బీచిగానిపల్లి, హొన్నంపల్లి, పరిగి పంచాయతీ కేంద్రాలలో ఏర్పాటు చేశారు. వాటి ద్వారా రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంతో ఈ సంఘాలు బాగా బలోపేతం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘాల ద్వారా రైతులు పొందుతున్న రుణాలలో మళ్లీ సొసైటీకి తిరిగి చెల్లించడంలో రైతుల విఫలమయ్యారు. దీంతో మండలంలోని బీచిగానిపల్లి, హొన్నంపల్లిలో ఉన్న వ్యవసాయ పరపతి సంఘాల భవనాలను మూసి వేశారు. అయితే నాటినుండి ఈ రెండు పంచాయతీ పరిధిలోని సొసైటీ సంఘాలు పరిగి వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోకి ఐక్యం చేసి రైతులకు మరింత సౌలభ్యమైన సేవలను అందించాలని పరిగి మండలానికి ఓ సొసైటీ అధ్యక్షుడిని ప్రభుత్వం నియమించింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వంలో పరిగి మండలంలోని 14 పంచాయతీలుగాను ఒక్కో పంచాయతీకి రైతు సంఘాలను ఏర్పాటు చేసి ఐదు కోట్ల రూపాయలతో రైతులకు నూర్పిడి యంత్రాలు, ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరికరాలు అందించారు. అయితే ఈ రుణాలను సొసైటీకి కట్టడంలో సంబంధిత రైతులు విఫలమవడం మండల వ్యాప్తంగా నూర్పిడి యంత్రాల పనితీరు రోజురోజుకు తగ్గడంతో రైతులు సైతం నష్టపోయారు.

శిథిలావస్థలో సొసైటీ భవనం

1986లో పరిగి మండల కేంద్రంలో రైతుల వద్దకే సంక్షేమ పథకాలు అందించాలని ఉద్దేశంతో నాటి ప్రభుత్వం వ్యవసాయ పరపతి సహకార సంఘం ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో భవనాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ భవనం గత 10 సంవత్సరాల మునుపే శిథిలావస్థకు రావడంతో నూతన భవన నిర్మాణానికి 421-3 ఎ సర్వే నెంబర్‌లో 16 సెంట్లు స్థలాన్ని వ్యవసాయ పరపతి సంఘానికి పరిగి గ్రామస్తులైన ఆదిరెడ్డి చిన్న సుబ్బయ్య గారి హరివప్ప, నంజుండయ్య ఆంజనేయస్వామి దేవస్థానానికి, వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ నూతన భవన నిర్మాణానికి అందించినట్లు వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు ఆంజనేయ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీరాములు వెల్లడించారు. అయితే గ్రామానికి చెందిన ఒక కుటుంబం ఈ స్థలాన్ని పూర్తిగా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించింది. కొంతమంది రాజకీయ నాయకుల పలుకుబడితో అటు ఆలయ కమిటీని ఇటు వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ సభ్యులను ఇబ్బందులకు గురి చేసింది. అయితే ఈ స్థలం సొసైటీ కి చెందాలని కోర్టును ఆశ్రయించారు. హిందూపురం జిల్లా కోర్టు ఆక్రమణలను తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు రాజకీయ నాయకుల ద్వారా వచ్చే ఒత్తిళ్లకు తలొగ్గి ముందుకు రాలేదు. కోట్ల రూపాయల స్థలం ఆక్రమణదారులకు వదలకుండా ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని పలుమార్లు ప్రజా సమస్యల వేదికల ద్వారా అధికారులను కోరినప్పటికీ ఇంతవరకు ప్రయోజనం కలుగలేదు.

దాతల భూమి ప్రభుత్వానికి చెందాలి



నాడు గ్రామానికి చెందిన ఆదిరెడ్డి చిన్న బచ్చన్న గారి అరివప్ప నంజుండయ్య కొంతమంది దాతలు ప్రజా ప్రయోజన కోసం లక్షల రూపాయల విలువజేసే 16 సెంట్లు స్థలాన్ని దానం చేశారు. ఈ స్థలం కొంతమంది ఆక్రమించు కోవాలను కోవటం దుర్మార్గం. ఆ భూమి ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎంతవరకైనా పోరాడుతాం.

శ్రీరామప్ప,
వాల్మీకి సంఘం కార్యదర్శి

సొసైటీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం

పరిగి మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సహకార పరపతి సంఘం భవనానికి కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురైంది. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకొని నూతన భవనాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఇప్పటికే జిల్లా కోర్టు సైతం ఈ స్థలం సొసైటీ దని ఆదేశాలు ఇచ్చింది. సొసైటీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. గ్రామస్తులు రైతుల సహకారంతో భవన నిర్మాణాన్ని చేపడతాం.

చెన్నకృష్ణారెడ్డి,
మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు

జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ పురుషుల, మహిళల జట్ల ఎంపికను ఆదివారం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జేవీ అనిల్ కుమార్ మాట్లాడుతూ మొత్తం 25 మందితో ప్రాబబుల్స్ ఎంపిక జరిగిందని, ఇందులో తుది జట్లను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ సీనియర్ పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సలీం, ట్రెజరర్ శేఖర్, ఈసీ మెంబర్ విజయవాణి, ఆజాద్, ఫుట్బాల్ కోచ్‌లు బాలాజీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్ లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ టిఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జిల్లా స్థాయి అధికారులు అందరూ కలిసి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అలాగే ఆయా డివిజన్, మండల, మున్సిపల్ కార్యాలయాలలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కలెక్టరేట్లో అర్జీదారుల కోసం ప్రత్యేకంగా 1100 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని అర్జీదారుడు సమస్య పరిష్కారం కాకపోతే టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి సంప్రదించవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఉచిత మూర్ఛ వ్యాధి వైద్య శిబిరం

ప్రజాశక్తి హిందూపురం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో 130 వ ఉచిత మూర్ఛవాది వైద్య శిబిరాన్ని డాక్టర్ ఈటి రామ్మూర్తి నేతృత్వంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఇ టి రామ్మూర్తి తో పాటు చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రిజ్వానా, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ ఇందాదుల్లా హాజరై 54 మంది మూర్ఛ రోగులను వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ ఇటి రామ్మూర్తి, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులను వైద్యులు ఇందాదుల్లా ప్రశంసించి రూ.5వేలు విరాళాన్ని అందించారు.. ఈ వైద్య శిబిరంలో జెవివి నాయకులు రామకృష్ణ, గంగిరెడ్డి, ఉగ్రప్ప, అంజన్ రెడ్డి, జిఆర్ శ్రీనివాసులు, లక్ష్మీపతి, ఎం. రామకృష్ణ, అతావుల్లా, మురళీమోహన్, అబ్దుల్ హాఖ్, కృష్ణమోహన్ రెడ్డి, సుబ్రమణ్య నాయక్, మంజునాథ చారి, విశ్వనాథ చారి, చంద్రశేఖర్ రెడ్డి, బాలగంగాధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ షేక్ రహిమాన్ హుస్సేన్

వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ షేక్ రహిమాన్ హుస్సేన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనున్న వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలను జిల్లా వక్ఫ్ బోర్డు తీసుకుంటున్నట్లు వక్ఫ్ ఇన్స్‌పెక్టరు షేక్ రహిమాన్ హుస్సేన్ పేర్కొన్నారు. జిల్లాలోనున్న వక్ఫ్ ఆస్తులు, వక్ఫ్‌బోర్డు పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై ఉమ్మడి జిల్లా వక్ఫ్ ఇన్స్‌పెక్టర్ రహిమాన్ హుస్సేన్ ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో బోర్డు పరిధిలో ఎన్ని ప్రార్థనా సంస్థలున్నాయి. ?

జవాబు : ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 330 ప్రార్థనా మందిరాలున్నాయి. ఇందులో మసీదులు, ఆసురఖానాలు, దర్గాలు ఇలా అన్ని రకాలైన ప్రార్థనా మందిరాలున్నాయి. కొత్త జిల్లాల ప్రకారం చూస్తే 226 అనంతపురం జిల్లాలో ఉండగా 104 సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇందులో 145 ప్రార్థనా మందిరాలు ఆదాయ వనరు కలిగి ఉండగా తక్కినవి పెద్దగా ఆదాయ వనరుల్లేనివి. ఆయా కమిటీ ఆధ్వర్యంలో వీటి నిర్వహణ జరుగుతూ ఉంటుంది. వక్ఫ్‌బోర్డు వాటి పర్యవేక్షణ జరుపుతూ ఉంటుంది.

ప్ర: వక్ఫ్ పరిధిలో ఆస్తులెన్ని ఉన్నాయి. ?

జ : వక్ఫ్ బోర్డు పరిధిలో మొత్తం 10339 ఎకరాల భూములుండేవి. అయితే జాగీదార్ల రద్దు చట్టం తరువాత 7014.32 ఎకరాల భూములు వక్ఫ్ పరిధిలో నుంచి తొలగించబడ్డాయి. ఇవి పోనూ ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 3238.12 ఎకరాల భూములు ఇప్పుడు వక్ఫ్‌బోర్డు పరిధిలోనున్నాయి. ఇందులో కొన్ని ఉపయోగంలో ఉండగా, కొన్ని నిరుపయోగంగానున్న భూములు కూడా ఉన్నాయి.

ప్ర : అన్ని సంస్థల ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఏటా వస్తున్న ఆదాయం ఏ మేరకు ఉంటుంది ?

జ : వక్ఫ్‌బోర్డు పరిధిలోనున్న ప్రార్థనా మందిరాల నిర్వహణ ముత్తువల్లిలు, కమిటీల ఆధ్వర్యంలో నడుస్తూ ఉంటాయి. ఈరకంగా చూసినప్పుడు అనంతపురం జిల్లాలో సుమారు ఏడాదికి రూ.10 లక్షల రూపాయల వరకు వక్ఫ్‌బోర్డుకు ఆదాయం సమకూరుతూ ఉంటుంది.

ప్ర:అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తుల పరిస్థితి ఏమిటీ ?

జ : ఆక్రమణలకు గురైన ఆస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అనేక కేసులు న్యాయస్థానంలో నడుస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం : మంత్రి

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ల అని రాష్ట్ర మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 8 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం మంత్రి అధికారులు, స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ముందుగా దండేపల్లి క్రాస్ నుంచి నల్లూరు వరకూ రూ. 1.14 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన బీటీ రోడ్డును, నల్లూరు నుంచి కల్లుకుంట వెళ్లే మార్గంలో పెన్నా నదిపై రూ. 4.4 కోట్ల వ్యయంతో చేపట్టిన కాజ్‌వే పనులను పరిశీలించారు. అనంతరం పెద్దగువ్వలపల్లి నుంచి కల్లుకుంట క్రాస్ వరకూ రూ. 75 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డ పనులను పరిశీలించారు. డిఆర్ కొట్టాల నుంచి దొడఘట్ట వెళ్లే దారిలో వాగుపై రూ. 1.3 కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా సకాలంలో పూర్తిచేయాలని గుత్తేదారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సిపి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ఎన్నికల వాగ్దానాలను ఒక్కొ క్కటి నెరవేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 44 గోకులం షెడ్లు నిర్మించా మని, త్వరలో మరిన్ని గోకులాలు నిర్మిస్తామని తెలిపారు. ఎంజెపి స్కూల్ భవనం నిర్మాణ పనులు రూ. 20 కోట్లతో చేపట్టామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు దొడఘట్టలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తిచేశామని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. మంత్రి వెంట మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, వీరాంజి, హరీష్, పవన్, మంజు, జనార్ధన్, బాషా, హనుమంతరాయుడు, నాగరాజు, బాబు ఉన్నారు.

పెన్నా నదిపై చేపట్టిన కాజ్‌వే పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పెనుకొండ : సిఎం సహాయనిధి ద్వారా 21 మందికి మంజూరైన చెక్కులను ఆదివారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత రూ. 13,61,793 చెక్కులను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి సిఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారన్నారు. వైద్యం కోసం ఖర్చు చేసిన బాధితులకు ఆర్థికంగా చేయూతనందించేందుకు సిఎం సహాయనిధి ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల పార్టీ కన్వీనర్లు శ్రీరాములు యాదవ్, ఈశ్వర ప్రసాద్, నాయకులు నారాయణస్వామి, సూర్యనారాయణ, సింగిల్‌విండో డైరెక్టర్ శేషు పాల్గొన్నారు.

దేశ సేవలో భారతీయ ముస్లింల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి హిందూపురం

దేశ స్వాతంత్రం కోసం చేసిన పోరాటంలో భారతీయ ముస్లింలు చేసిన సేవలు వెలకట్టలేనివని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ అన్నారు. స్వతంత్ర పోరాట సమయంలో ముస్లిం యోధులు, ముస్లిం సామాజిక కార్యకర్తలు, ముస్లిం రచయితలు, సాహితీకారులు తమ మాన ప్రాణాలను దేశం కోసం త్యాగం చేశారని, వారి త్యాగాలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. హిందూపురం పట్టణానికి చెందిన కవి, రచయిత, సామాజిక సేవ కార్యకర్త ఉమర్ ఫరూక్ ఖాన్ సంకలనం చేసిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్ లో భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, శ్రీ సత్యసాయి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జాబిలి చాంద్‌బాషా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తి గోపాల గౌడతో పాటు ఆంధ్రప్రభ ఎడిటర్ వైయస్సార్ శర్మ, గజల్ శ్రీనివాస్, కళా రత్న డిక్కీకృష్ణ, ప్రముఖ స్వతంత్ర సమరయోధులు మెలవాయి గోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ డి రమేష్ కుమార్ హాజరయ్యారు. మాజీ న్యాయమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించి స్వతంత్ర సమరయోధులు గోవిందరెడ్డికి మొదటి ప్రతి అందజేశారు. అనంతరం గోపాల గౌడ మాట్లాడుతూ ఉమర్ ఫరూక్ ఖాన్ రచించిన భారతీయ ముస్లిం లెజెండ్స్ పుస్తకంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ముస్లిం సోదరులు త్యాగాలు, సేవలు, దేశ చరిత్ర ఉన్నాయన్నారు. ఇంతటి గొప్ప పుస్తకాన్ని ఆవిష్కరించడం తనకు గర్వంగా ఉందన్నారు. ఈ పుస్తకానికి ముందుమాట రాయడం సంతోషంగా ఉందన్నారు. 150 మంది గొప్ప ముస్లింల వివరాలను పుస్తక రూపంలో తీసుకురావడం, అందుకు దశాబ్ద కాలం పాటు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఆంధ్రప్రభ ఎడిటర్ శర్మ మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో అభివృద్ధిలో ముస్లింల పాత్రను వివరించే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 150 భాషల్లో ఎన్నో పాటలు పాడిన ఇంకా ఏదో చేయాలని తపన తనకు ఉందన్నారు. అలాంటి తపన తీరేలా ఈ పుస్తకంలో 150 మంది ముస్లిం భారతీయ యోధుల వివరాలను తెలుసుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. నేటి సమాజంలో కనుమరుగవుతున్న ముస్లింల చరిత్రను వెలికి తీసి సమాజానికి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని కవి కృష్ణ అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డి ఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ, ఉమర్ ఫరూక్ ఖాన్ ఎంతో మందికి సేవలు అందించడమే కాకుండా వసుదైక కుటుంబం కోసం శ్రమిస్తున్నారని కొనియాడారు. చివరగా ఉమర్ ఫరుఖాన్ మాట్లాడుతూ తాను రచించిన ఈ పుస్తకాన్ని తన తల్లికి అంకితం చేస్తున్నట్లు సభ ముఖంగా పేర్కొన్నారు. అనంతరం 50 మంది సామాజిక సేవకులకు, 50 మంది సాహితీ వేత్తలకు భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ సాహితీ సామాజిక సేవ పురస్కారాలు ప్రముఖుల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లి విద్యాధర్ రావు, డాక్టర్ ఉమర్ అలీషా, సయ్యద్ అహ్మద్ ,అనంత రాముడు, కె.వి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణలో సుప్రీంకోర్టు మాజీ జడ్జి గోపాలగౌడ

ముస్లిం లెజెండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి గోపాల గౌడ, తదితరులు

హోం మంత్రి అనిత పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, ఎమ్మెల్యే

హోం శాఖ మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-మడకశిర టౌన్

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో ఆదివారం ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఇండియన్ గ్యాస్ పరిశ్రమ, అమరాపురం బస్టాండ్‌లో జరిగే బహిరంగ ప్రదేశాలను పరిశీలించారు. అలాగే పోలీసు బందోబస్తు, తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. మంత్రి పర్యటించే ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

కొడికొండ చెక్‌పోస్ట్‌లో మంత్రి 'కొల్లు' తనిఖీ

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఎక్సైజ్, గనులు, భూగర్భశాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మానవ తప్పిదాలు తగ్గించేందుకు ఆధునిక యంత్ర పరికరాల వాడకాన్ని పరిశీలించాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. తనిఖీ ప్రక్రియ మరింత సమర్థవంతంగా ఉండాలన్నారు. మంత్రి వెంట ఒఎస్‌డి కెఎల్. గోపాల్, అనంతపురం మద్యనిషేధం, ఎక్సైజ్ ఉపకమిషనర్ పి.నాగమద్దయ్య, జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.నరసింహులు, చెక్ పోస్ట్ సిఐ శ్రీధర్, ఎస్ఐ విజయ్ ఉన్నారు.

చెక్‌పోస్టులో సిసి కెమెరాల పనితీరుపై ఆరా తీస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అధికారులను కలిసిన మార్కెట్ యార్డ్ ఛైర్మన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఇటీవల కొత్తచెరువు మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ఎంపికైన జనసేన పార్టీ నాయకుడు పూల శివప్రసాద్ ఆదివారం పలువురు అధికారులను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత ఆర్డీవో సువర్ణను కలిసి పూలబొకే అందజేశారు. అలాగే డిఆర్ఒ, తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డిని కలిసి పూలబొకే అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తనను గుర్తించి మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా నియమించడం పల్లెకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతు సేవలో తరిస్తానని తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, నాయకులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శ్రీసాయికాళేశ్వరస్వామి ఆశ్రమంలోని షిరిడీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవ్యశ్రీ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో దాదాపు 138 మంది పాల్గొన్నారు. అందరికీ వినికిడి సమస్యలకు పరీక్షలు నిర్వహించి, సుమారు 87 మందికి వినికిడి యంత్రాలు, బ్యాటరీలు ఉచితంగా అందజేశారు. 46 మందికి ఫాలో అప్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప, వైద్యులు, ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని మాధవరాయ ఆలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులుగా బాబ్‌జాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండ, ప్రధాన కార్యదర్శిగా సాంబశివ, ముత్యాలప్ప మరో 16 మంది సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులను ఏకం చేసి కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు ముద్దల వెంకటరమణప్ప, కార్మిక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జె.ప్రతాప్‌రెడ్డి, అనిత

ఎంజెపి పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

రొద్దం : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సిసిఎల్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ కంపెనీ వారు హైదరా బాద్‌కు చెందిన సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్.మరవపల్లి మహాత్మజ్యోతి బాపూలే పాఠశాలలో వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను రూ. 1.7 లక్షలతో ఏర్పాటుచేశారు. ఈ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరైన సాహితీ గగన్ మహల్ అధ్యక్షుడు, న్యాయవాది జె.ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపల్ అనిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ జిల్లాలో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో విశేష కృషి చేస్తోందన్నారు. కార్యక్రమలో అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి విరాళాల వెల్లువ

నల్లచెరువు : నల్లచెరువులో రామాలయం నిర్మాణం కోసం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. వారి లో తలమర్లవాండ్లపల్లి సర్పంచి నాయుడు రూ. 20,116, పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ దేవరెంటి భాస్కర్‌రెడ్డి రూ. 25116, పిటి.దామోదర్‌గుప్తా రూ. 25116, పాలపాటిదిన్నె పూజారి నాగరాజు రూ. 10వేలు, సంజీవపల్లి వాస్తవ్యులు కర్నాటక శంకర్‌నాయుడు రూ. 10,116, కంతంపల్లి ఇమామ్ కాసిం కుమారులు రియాజ్, నూర్‌అహ్మద్ రూ. 10,116, కదిరి బిల్డింగ్ బిల్డర్ గంగులప్ప రూ. 10,116, నల్లచెరువు బస్టాండ్‌లో ఉన్న గట్ట హరినాథ్ రూ. 10,116, పోస్ట్‌మాన్ సింహం నరసింహులు రూ. 25,116, టైలర్ రామానుజులు రూ. 5వేలు అందజేశారు.

మహిళకు వడ్డెర సంఘం ఆర్థికసాయం

కొత్తచెరువు : వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దండగల మారెప్ప భార్య, కార్యవర్గ సభ్యురాలు దండగల లక్ష్మీదేవి అనంతపురం ప్రభుత్వసుపత్రిలో గొంతుకు శస్త్రచికిత్స చేయించుకుంది. విషయం తెలిసిన వెంటనే వడ్డెర సంఘం జిల్లా నాయకులు, శ్రీవెంకటరమణస్వామి బోర్‌వెల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దళవాయి పెద్ద మారెప్ప, గౌరవాధ్యక్షులు దళవాయి వెంకటనారాయణ ఆదివారం ఆసుపత్రికి వెళ్లి లక్ష్మీదేవిని పరామర్శించి వారిద్దరూ రూ. 10 వేల చొప్పున రూ. 20వేలు అందజేశారు. వారి వెంట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల చక్రపాణి, గంగులప్ప, శ్రీరాములు ఉన్నారు.

ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదు అందజేత

కదిరి అర్బన్ : బస్సులో ప్రయాణం చేస్తూ పోగొట్టుకున్న నగదు ఉన్న పర్సును ప్రయాణికునికి అందించి ఆర్టీసీ సిబ్బంది శభాష్ అనిపించుకున్నారు. వారు తెలిపిన వివరాలు.. కదిరి డిపోనకు చెందిన బస్సులో ఆదివారం ఓ ప్రయాణికుడు కదిరి నుంచి మదనపల్లికి వెళ్లాడు. ఈ క్రమంలో అతడు బస్సులో నగదు ఉన్న పర్సుని పోగొట్టుకుని యధావిధిగా బస్సు దిగి వెళ్లిపోయాడు. బస్సు డ్రైవర్ రుద్రనాయుడు, కండక్టర్ టిజి.ప్రసాద్ బస్సులో పడి ఉన్న పర్సును గుర్తించారు. అందులోని సమాచారం మేరకు ప్రయాణికుడిని పులివెందులకు చెందిన ఆర్‌అండ్‌బి డ్రైవర్ మహబూబ్‌బాషాగా గుర్తించారు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ఆధారంగా అతడి వివరాలు తెలుసుకుని నిర్ధారణ చేసుకున్నారు. ఆ తర్వాత కదిరి డిపోనకు చెందిన బలిజపల్లి సర్వీస్ కండక్టర్ కె.హరికుమార్, డ్రైవర్ ఎంవి.రమణ ఆధ్వర్యంలో అతడికి నగదు, పర్స్ అందజేశారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది నిజాయితీని పలువురు కొనియాడారు.

టిడిపి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

నల్లమాడ : మండలంలోని పులగంపల్లి పంచాయతీకి చెందిన టిడిపి నాయకులు గంగాద్రికి అనారోగ్యం కారణంగా ఇటీవల కుడి కాలు పూర్తిగా తొలగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆ గ్రామం వెళ్లి గంగాద్రిని పరామర్శించారు. మీకు మేము, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మండల కన్వీనర్ మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణంనాయుడు, సర్పంచి రమావత్, భారతీయ చాంప్లానాయక్, సలాం ఖాన్, రమణారెడ్డి, కేశవరెడ్డి, రమణ, రెడ్డిపల్లినాయుడు, పెద్దప్పయ్యనాయుడు, శివప్రసాద్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ఎన్.నరసింహులు, అరవింద్‌బాబు, పుట్ల రవీంద్ర, పఠాన్ బాబావలి, చంద్రారెడ్డి, సుబ్బిరెడ్డి, రామప్ప, కె.భయ్యారెడ్డి ఉన్నారు.

టిడిపి నాయకుడు గంగాద్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

రాజకీయ కక్షతోనే ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు : వైసిపి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తూ దని వైసిపి వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర విమర్శించారు. మండలంలోని నాగలూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. అందులో భాగంగానే లేని మద్యం కుంభకోణాన్ని తెరమీదకు తెచ్చి అక్రమంగా ఎంపి మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం దారుణం అన్నారు. ఇప్పటికే కూటమి నాయకుల దౌర్జన్యాలతో వైసిపి శ్రేణులు ఎన్నో రకాలుగా ఇబ్బందుల పడుతున్నారన్నారు. ఇప్పుడు ప్రజాప్రతినిధులను సైతం అక్రమంగా అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో సర్పంచులు నాగరాజు, సునందమ్మ, ఎంపిటిసి రత్నమ్మ, శివయ్య, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నాయకులు నాగులూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, పెనుకొండ మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్లు శ్రీరాములు, గణపు, బోయబాబు, సద్దాం, యాసిన్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మల్లిరెడ్డి, పీట్ల బాబు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో పాల్గొన్న వైసిపి నాయకులు

మడకశిర టౌన్ : రాజకీయ కక్ష సాధింపుతోనే వైసిపి ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కోవడానికి చేతకాక లిక్కర్ కేసులో ఎలాంటి సంబంధం లేకపోయినా అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు.

కొత్తచెరువు : రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు చేశారని వైసిపి మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, తెలిపారు. ఆయన స్థానిక ధర్మవరం రోడ్డులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపులతో మిథున్‌రెడ్డిపై మద్యం కేసు సృష్టించి నిందితునిగా చేర్చిందన్నారు. ఇలాంటి వాటికి స్వస్తి పలకాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వాల్మీకి శంకర్, వడ్డే నారాయణ, లోచర్ల రాజారెడ్డి, ఎంపిటీసి రఫీ, మండల బిసి సెల్ అధ్యక్షులు భాస్కర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు చెన్నరాయుడు, సయ్యద్‌బాషా, వెంకటరాముడు, సల్మాన్‌ఖాన్ పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైసిపి నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధ్యారాజునాయుడు పేర్కొన్నారు. ఒడిసిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్ట్‌లు చేస్తుందన్నారు. వేధింపులు ఇలానే కొనసాగితే ఏ మాత్రం సహించబోమన్నారు. ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతామన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో పని చేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎపి ఎన్‌హెచ్ ఎం జెఎసి రాష్ట్ర అధ్యక్షులు దయామని కోరారు. పట్టణంలోని ప్రశాంతి గ్రామంలోని సిపిఎం కార్యాల యంలో ఆదివారం ఎపి ఎన్జీవో అధ్యక్షులు రామ్మోహన్ ఆధ్వర్యం లో జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు దయామనితోపాటు సిఐటియు జిల్లా కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, ఎపి ఎన్‌హెచ్‌ఎం జనరల్ సెక్రట రీ ప్రభాకర్ రెడ్డి, స్టాఫ్ నర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష, జిల్లా అధ్యక్షులు తులసి, అబిద్‌బాషా పాల్గొని ప్రసంగించారు. దయామని మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న ఉద్యోగస్తులందరికీ ఎంటిఎస్, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, ఒకే క్యాడర్‌కు ఒకే వేతనం చెల్లించాలని, అర్హులను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, గతంలో జెఎసి రాష్ట్ర కమిటీ చర్చించిన అంశాల మేరకు ప్రారంభ తేదీ నుంచి అరియర్స్, ఇంక్రిమెంట్లు తక్షణం అమలు చేయాలన్నారు.

ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయిం చారు. అనంతరం ఎన్‌హెచ్‌ఎం నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా అబీద్‌బాషా, జనరల్ సెక్రటరీగా పి.తులసి, వైస్ ఛైర్మన్‌గా రహమత్‌బాషా, సభ్యులుగా ఆంజనేయు లు, లోకేష్, మురళిని ఎన్నుకున్నారు. అనంతరం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఎపి ఎన్జీవోస్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నృత్యం చేస్తున్న కళాకారులు

శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వారాంతపు సెలవు కారణం గా ఆదివారం పట్టణంలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకూ జయంతి చారి ఆర్‌డి డ్యాన్స్ అకాడమీ బృందం బెంగళూరు వారి ఆధ్వర్యంలో భరతనాట్యం ప్రదర్శన ఏర్పాటు చేశారు. కళాకారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి, ఇతర నృత్యాలు ప్రేక్షకులను అలరించారు. ప్రధానంగా గణేష్ వందన, నారాయణతే నమో నమ్మ, అదిగో అల్లదిగో, భజగోవిందం, అష్టలక్ష్మి స్తోత్రం తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. శిల్పారామం ఏవో ఖాదర్‌వలి మాట్లాడుతూ వారాంతపు సెలవు అయిన ఆదివారం రోజున ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలన ఆహ్లాదపరిచేలా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో కళాకారులు రాధిక, శ్రీధరన్, రమాదేవి, సంజననారాయణ, అర్పితా నందన్, అవంతిక, శుభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలకు పూర్వవైభవం తెద్దాం

లేపాక్షి : ప్రాచీన కళలకు పూర్వ వైభవం తెద్దాం.. కళాకారులను గుర్తించి గౌరవిద్దామని తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు అంజనప్ప, డైరెక్టర్ పెద్దరికం సాయి పిలుపునిచ్చారు. స్థానిక ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం ట్రస్టు, కళాభిషేకం వారి ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల కళాకారులతో ఏకపాత్రాఅభినయం పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆధునిక సమాజంలో తెలుగు సంప్రదాయ కళారూపాలు కనుమరుగవుతున్న నేపథ్యంలో తేనె తెలుగు కల్చరల్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మారుమూల ప్రాంతాల్లో ఉన్న కళాకారులను గుర్తించి గౌరవించడంతో పాటు వారి ప్రతిభను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా తెలుగు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన కళాకారులతో పద్యనాటకం, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించి, కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు రామనాథరావు, వివి.రావు, సామవేదం సుబ్రహ్మణ్యం, లక్ష్మినారాయణస్వామి, వివిధ రాష్ట్రాల కళాకారులూ హాజరయ్యారు.

గంగమ్మకు జ్యోతులు

గాండ్లపెంట : మండలంలోని సోమయాజులపల్లి దళితవాడకు చెందిన మహిళలు ఆదివారం గ్రామ శివారులో వెలసిన గంగమ్మకు జ్యోతులు, బోనాలు సమర్పించారు. భక్తులకు బోనాల ప్రసాదం పంపిణీ చేశారు. మహిళలు మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాసంలో ఆనవాయితీగా సుమారు 150 కుటుంబాలు గంగమ్మకు జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకుంటామన్నారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండి దిగుబడి బాగా రావాలని ఆకాంక్షతో పూజలు నిర్వహించామన్నారు.

గంగమ్మకు జ్యోతులు, బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

గుండెపోటుతో లైన్‌మెన్ మృతి

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని దాడితోట గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో దాడితోట లైన్‌మెన్‌గా పని చేస్తున్న వీరయ్య(55) ఆదివారం తెల్లవారుజా మున తాడిమర్రిలోని తన నివాసంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. గమనించిన భార్య వెంటనే స్థానికుల సాయంతో అక్కడే ప్రథమ చికిత్స చేయించి ఆ తర్వాత అంబులెన్స్‌లో బత్తల పల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. వీరయ్యకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు మృతి చెందడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిం చారు. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులు దాడితోట గ్రామం వెళ్లి వీరయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీరయ్య స్వగ్రామం చిల్లకొండయ్య పల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

వీరయ్య(ఫైల్‌ఫొటో)

ముగిసిన మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నంలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా కోటవీధి, పేట వీధుల్లోని పీర్లచావిడిల్లో పీర్లను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది వారం ఉదయాన్నే పీర్లను గ్రామంలో ఊరేగించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. సాయంత్రం కోట వీధి, పేట వీధిలోని పీర్లు ఊరేగింపుగా స్థానిక తేరుకూడలి వద్దకు చేరుకుని అక్కడి నుంచి జలధికి తరలి వెళ్లాయి. ఊరేగింపులో భక్తజనం ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు చక్కెర చదివిం చారు. ఊరేగిం పులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కృష్ణమూర్తి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిలమత్తూరు : మండలంలోని తుమ్మలకుంట, నల్లబొమ్మనపల్లి, ఆరుమాకులపల్లి, సంజీవరాయుని పల్లి, చిన్నన్నపల్లి గ్రామలలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. చావిడిలో పీర్లను ఏర్పాటు చేసి ఐదు రోజుల నుంచి పూజలు చేశారు. భక్తులు చక్కెర, బెల్లం చదివింపులు చేశారు. ఆదివారం సాయంత్రం గ్రామాల్లో పీర్లను ఊరేగించి జలధికి తరలించారు. ఊరేగింపులో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాకుండా కర్నాటకలోని బాగేపల్లి, తదితర గ్రామాల నుంచి భక్తజనం తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నల్లచెరువు : నల్లచెరువులో ఆదివారం సాయంత్రం పీర్ల ఊరేగింపు భక్తుల కోలాహలం మధ్య వైభవంగా నిర్వహించారు. పీర్లు జలధికి తరలుతుండగా చూసేందుకు స్థానిక బసవన్న కట్ట వద్దకు భక్తజనం పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రధానంగా భక్తులు మౌలాలి స్వామి పీరును దర్శించుకొని అలావ్ తొక్కారు. దాతల సహాయంతో అన్నదానం, తీర్థ ప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మక్బూల్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటనారాయణ, మురళి, రఫీ, జిలాన్, బాలాజీ, షాకీర్, బావాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుక్కపట్నంలో జలధికి తరలుతున్న పీర్లు

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ప్రజాశక్తి-లేపాక్షి

సిఎం చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి వైసిపి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మధుమతిరెడ్డి సూచించారు. లేపాక్షిలో ఆదివారం వైసిపి మండల కన్వీనర్ సయ్యద్ నిస్సార్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిం చగా ముఖ్యఅతిథులుగా దీపిక, మధుమతి రెడ్డి పాల్గొన్నారు. వారు ముందుగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేస్తూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారున. అనంతరం చంద్రబా బు అంటేనే మోసం, రీకాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించి క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు ఎవరూ లేరన్నారు. అధికారం చేపట్టి 13 నెలలైనా ఎన్నికల హామీలు అమలు చేయలేద న్నారు. రాష్ట్రంలో ఆట విక పాలన కొనసాగుతోందని, మహిళలకు రక్షణ కరువైందన్నారు. శాంతి భద్రతలను పూర్తిగా విస్మరిం చారని, పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని వైసిపి శ్రేణులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శివ, సురేష్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లన్న, హనుక్, ఆంజనరెడ్డి, వెంకటేష్‌స్వామి పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'లో పాల్గొన్న వైసిపి నాయకులు